క్లుప్తంగా

వృద్ధుడికి ట్రై సైకిల్ అందజేత



పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): వృద్ధులు, దివ్యాంగుల పట్ల ప్రభుత్వం ఎంతో సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన ఆవుల సుబ్బన్న అనారోగ్యంతో నడవలేని స్థితిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఇటీవల తనకు మూడు చక్రాల బండి ఇప్పించాలని ఎమ్మెల్యే సుచరితకు విన్నవించాడు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే శనివారం తన కార్యాలయంలో సుబ్బన్నకు ట్రై సైకిల్‌ను అందించారు. సుబ్బన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గృహ నిర్మాణాలపై దృష్టి సారించాలి

హౌసింగ్ ఏఈ కె. సురేష్




నడింపాలెం (ప్రత్తిపాడు): వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై లబ్ధిదారులు దృష్టిపెట్టాలని హౌసింగ్ ఏఈ ఎ.సురేష్ అన్నారు. నడింపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద హౌసింగ్ లబ్ధిదారులతో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హౌసింగ్ ఏఈ సురేష్ తొలుత లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను త్వరితగతిన నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్మాణానికి రూ. 1.80 లక్షలు ఇస్తుందని, అదనంగా డీఆర్‌డీఏ నుంచి రూ.30 వేలు రుణంగా ఇవ్వనున్నారని చెప్పారు. ఇళ్లను నిర్మించుకోలేని స్థితిలో ఉంటే ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి, ఇస్తుందని వివరించారు. నిర్మాణ పనులను ఇప్పుడే మొదలు పెట్టాలని, లేనిపక్షంలో వర్షాలు మొదలైతే పనులకు ఆటంకం ఏర్పడుతుందని లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరమ్య, పంచాయతీ కార్యదర్శి ఖాజా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులున్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాలి



కాకుమాను: ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ అందేలా కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తేళ్ల ప్రేమ కుమారి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జగనన్న సురక్ష పథకంపై మండల స్థాయి అధికారులు, పంచాయతీ, గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. పథకాలు అందని వారి వివరాలు నమోదు చేసుకుని, వారి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీవీఐటీలో 'నారాయణ అండ్ కో' చిత్ర బృందం సందడి



పెదకాకాని: లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫేమ్ సుధాకర్, పూజ కిరణ్, జంటగా పాపిచెట్టి చిన్నా దర్శకత్వంలో రూపొందిన నారాయణ అండ్ కో చిత్ర బృందం వీవీఐటీలో శనివారం సందడి చేసింది. ఈ నెల 30న చిత్రం విడుదల సందర్భంగా చిత్రబృందం శనివారం నంబూరు వీవీఐటీ కళాశాలను సందర్శించింది. హీరో సుధాకర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన హాస్యంతో అందరినీ అలరించే విధంగా చిత్రం రూపొందించినట్లుతెలిపారు. దర్శకుడు పాపిశెట్టి చిన్న మాట్లాడుతూ చిత్రంలోని ప్రతి సన్నివేశం ఆసక్తిభరితంగా ఉంటుందన్నారు. చిత్ర బృందంతో కలిసి విద్యార్థులు నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ సతీష్ బదిలీ

ప్రత్తిపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో పి.సతీష్ బదిలీ అయ్యారు. బాపట్ల క్వాలిటీ కంట్రోల్ విభాగానికి వెళ్లారు. శనివారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

ప్రతి కుటుంబ అభివృద్ధే జగనన్న లక్ష్యం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- రూ.13.35 లక్షల సీఎం ఆర్‌ఎఫ్ నగదు చెక్కుల పంపిణీ



నగదు చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే సుచరిత

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి చేయటమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకుమాను గ్రామంకు చెందిన ప్రసాదం ఇమానియేలుకు రూ.5.30 లక్షలు, కారంపూడికి చెందిన వట్టిప్రోలు కుమారికి రూ.లక్ష, పెదపలకలూరుకు చెందిన కందుల అరుణకు రూ.1.40 లక్షలు, జన్మభూమి నగర్‌కు చెందిన జి.ధనలక్ష్మికి రూ.లక్ష, మల్లవరం గ్రామానికి చెందిన సంకు వెంకటేశ్వర్లుకు రూ.1.5 లక్షలు, రావిపాడుకు చెందిన యన్నం బసవపున్నయ్యకు రూ.లక్ష, మల్లవరం గ్రామానికి చెందిన గుంటక ఇందిరాదేవికి రూ.50 వేలు, నాగులపాడుకు చెందిన కొమ్మాల పాటి వేణుగోపాల్‌కు రూ.లక్ష, కాకుమానుకు చెందిన కోడూరి సుబ్బాయమ్మకు రూ.65 వేలు మొత్తం రూ.13.35,000ల ముఖ్యమంత్రి సహాయనిధి నగదు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీరమ్య, వేదికపై ఈఓపీఆర్డీ, ఏపీఎం తదితరులు

ప్రత్తిపాడు: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజా సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారాలు చూపడం జరుగుతుందని ఎంపీడీవో ఎ.శ్రీరమ్య అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఫంక్షనల్ అసిస్టెంట్లకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ మావులూరి మోషె విధి విధానాలు, ఉద్దేశాలు, అమలు తీరును వివరించారు. ఎంపీడీవో శ్రీరమ్య మాట్లాడుతూ రోజుకొక సచివాలయం, వారంలో మూడు రోజుల చొప్పున ఐదు వారాల పాటు కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో ఒక టీం, తహసీల్దారు ఆధ్వర్యంలో ఒక టీం చొప్పున రెండు బృందాలుగా ఏర్పడి ప్రజా సమస్యలను సచివాలయ స్థాయిలో అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సచివాలయం స్థాయిలో అర్హత ఉన్న ప్రజలకు పథకాలు అందలేదన్న ప్రసక్తే ఉండకూడదన్న ధృడ సంకల్పంతో ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సచివాలయ ఫంక్షనల్ అసిస్టెంట్లు, వలంటీర్లు ప్రజలకు 'జగనన్న సురక్ష'పై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిద్దార్థ, ఏపీఎం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

'చలపతి' కళాశాలకు పదేళ్ల స్వయం ప్రతిపత్తి



అటానమస్ కాపీని చూపుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ రామారావు, అధినేత వైవీ ఆంజనేయులు

గుంటూరు రూరల్: చలపతి ఫార్మసీ కళాశాలకు పది సంవత్సరాల స్వయం ప్రతిపత్తిని కల్పిస్తూ ఆచార్య నాగార్జున వ్యవసాయ విశ్వవిద్యాలయానికి యూజీసీ శనివారం ఆదేశాలు జారీ చేయటం సంతోషంగా ఉందని ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 2004లో ఏర్పాటైన ఫార్మసీ కళాశాల అన్ని రకాల స్పెషలైజేషన్ కోర్సులతో విస్తరించిందన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రీయల్ రీసెర్చ్ గుర్తింపు, నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్, నాక్, జాతీయస్థాయిలో ఏ-ప్లస్ గ్రేడ్‌ను సాధించిందన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాలగా ఫార్మా విద్యారంగంలో రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం పొందటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం లారీ ఢీ కొని.. చెక్‌పోస్టు ఉద్యోగి దుర్మరణం

చేబ్రోలు: ధాన్యం లారీ ఢీకొనడంతో.. ఉద్యోగి అక్కడక్కడే మరణించిన ఘటన నారాకోడూరు గ్రామ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ బాషా(42) మండల పరిధిలోని నారాకోడూరు చెక్‌పోస్టులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వట్టిచెరుకూరు మండలం కారంపూడి పాడు నుంచి ధాన్యం లోడుతో నరసరావుపేటకు బయలుదేరింది. నారాకోడూరు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న హుస్సేన్ బాషా లారీని ఆపే ప్రయత్నం చేశాడు. లారీ అదుపుతప్పి హుస్సేన్ బాషాను ఢీ కొట్టడంతో అక్కడక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. రేటూరు గ్రామానికి చెందిన నాగూర్ వలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



పాత మల్లాయపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు పురస్కారాల ప్రదానం

ప్రత్తిపాడు: విద్యాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సర్పంచ్ కాను పద్మావతి అన్నారు. ఈ నెల 15న నియోజకవర్గస్థాయిలో 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యాశాఖ, శనివారం పాఠశాల స్థాయిలో నిర్వహించింది. పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను రూ.3వేలు, రూ.2వేలు, వెయ్యిరూపాయలు నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ప్రత్తిపాడు మండలంలో.. ప్రత్తిపాడు హైస్కూల్ నుంచి కనుమూరి పరమేశ్వరి, సంగన వెంకట నవీన్‌రెడ్డి, రాజవరపు రాఘవేంద్రరావు, కోడూరు రోహిత్, పాతమల్లాయపాలెం హైస్కూల్ నుంచి ఎం.అజయ్‌బాబు, వి.గోవర్ధన్ రెడ్డి, కె.ప్రసన్నకుమార్, చినకోండ్రుపాడు హైస్కూల్ నుంచి ఎం.మహిమ, ఆర్.దుర్గం, వి.పార్థు, యనమదల హైస్కూల్ నుంచి ఆర్.హర్షిత్, కె.ప్రియాంక, బీటీఎస్ సాయితేజ, తిక్కిరెడ్డిపాలెం హైస్కూల్ నుంచి ఎం.లక్ష్మి, ఎస్.జగన్, బి.లభిషయ్, వంగిపురం హైస్కూల్ నుంచి ఎ.దీపిక, ఎం.అనూష, కె.రాజ్యలక్ష్మి, కోయవారిపాలెం హైస్కూల్ నుంచి సనోమల్, షేక్ హసీనా, జి.వైశాలిని, గొట్టిపాడు హైస్కూల్ నుంచి ఎస్‌టీ సాయిరాం, షేక్ నస్రీన్, బిజి విల్సినాలు నగదు పురస్కారాలు అందుకున్నారు. పాత మల్లాయపాలెంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాను పద్మావతి పురస్కాలు ప్రదానం చేశారు. ప్రత్తిపాడు హెచ్‌ఎం హెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు

ఐసీడీఎస్ పీడీ బి.మనోరంజని



అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీడీ మనోరంజని

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాలన్నింటికీ సొంత భవనాలు ఏర్పాటు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని ఐసీడీఎస్ పీడీ బి. మనోరంజని అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మెయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న కో-లొకేటెడ్ అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను స్థానిక అధికారులతో కలిసి పీడీ పరిశీలించారు. నిర్మాణ పనులు లెంటల్ లెవల్లోనే ఉండటాన్ని గమనించిన ఆమె రెండు రోజుల్లో రూఫ్ లెవల్ వరకు పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామచంద్రకు ఆదేశాలు జారీచేశారు. నియోజకవర్గంలోని వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడిలో కూడా ఒక కో-లొకేటెడ్ అంగన్‌వాడీ కేంద్రం మంజూరయ్యిందన్నారు. నాడు- నేడు పథకం కింద గుంటూరు జిల్లాలో మొత్తం 13 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరయ్యాయని, వాటిలో ఐదు కో-లొకేటెడ్ (పాఠశాలల్లో ఉన్నవి) కాగా, మరో ఎనిమిది కేంద్రాలు పాఠశాలలకు దూరంగా ఉన్నవని చెప్పారు. అన్ని కేంద్రాల నిర్మాణాలు ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. అదేవిధంగా జిల్లాలో పాఠశాలల్లో ఉన్న 58 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మత్తులకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నెలాఖరులోగా అన్ని అంగన్‌వాడీల్లో రిపేర్లు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందన్నారు. వీటన్నింటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. రెండవ దశలో కూడా మరికొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు కూడా మంజూరవుతాయని వివరించారు. వెంట సూపర్‌వైజర్ వెంకటరత్నం, అంగన్‌వాడీలు ఉన్నారు.

అప్పు తీసుకున్న వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

గుంటూరు రూరల్: హైవే కోసం భూసేకరణలో ఇచ్చేసిన స్థలాన్ని..అప్పు కింద తనఖా పెట్టి మోసం చేసిన వ్యక్తిపై నల్లపాడు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరులోని జేకేసీ కాలేజీ సమీపంలో నివాసితురాలు మద్దిశెట్టి సుజాత, అమరావతిరోడ్డులో నివాసం ఉంటున్న లక్ష్మిశెట్టి నరేంద్ర ప్రసాద్ కుటుంబ స్నేహితులు. నరేంద్ర ప్రసాద్ సుజాత వద్ద రూ.25 లక్షలు నగదు అప్పుగా తీసుకుని, వ్యాపారం చేశాడు. వ్యాపారం దెబ్బతినటంతో అప్పులయ్యాయని నగదు చెల్లించలేనని సుజాతకు చెప్పాడు. దీనికి సుజాత ఒప్పుకోవడంతో.. మంగళగిరి మండలం చినకాకానిలోని నరేంద్ర ప్రసాద్ అన్న పేరుతో ఉన్న స్థలాన్ని ఆమె పేరుతో రిజిస్టర్ చేయించాడు. సుజాత కొంత కాలానికి స్థలం వద్దకు వెళ్లి చూడగా.. ఆ స్థలం బైపాస్ కోసం ప్రభుత్వం పదేళ్ల క్రితం భూ సేకరణలో తీసుకోవటం జరిగిందని స్థానికులు తెలిపారు. దీంతో మోసపోయామని గమనించిన సుజాత పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు విచారణ చేసి, నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ ప్రభాకర్‌రెడ్డి

గుంటూరు రూరల్: నగరంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ సచివాలయ సిబ్బందికి, పంచాయితీ కార్యదర్శులకు, జగనన్న సురక్ష పథకంపై అవగాహన సదస్సును శనివారం ఆర్‌డీవో ప్రభాకరరెడ్డి నిర్వహించారు. జూన్ 23 నుంచి జూలై 23 వరకూ సచివాలయాల పరిధిలో వలంటీర్లు సర్వే నిర్వహించి, ప్రజల నుంచి అవసరమైన ధృవీకరణ పత్రాలను అందించేందుకు కార్యాచరణ రూపొందించటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి జగనన్న సురక్ష పథకం గురించి వివరించి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ విజయశ్రీ, ఎంపీడీఓ శోభరాణి, డిప్యూటీ తహసీల్దారు బిట్టు రమేష్, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు సచివాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని గౌరవం



ఉపాధ్యాయుడు రవికుమార్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): ఉపాధ్యాయవృత్తికి ఎనలేని గౌరవం ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నారావు అన్నారు. మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల కమిటీ సమావేశం హెచ్‌ఎం రత్నారావు అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వం పాఠశాలలకు కల్పిస్తున్న వతసులు, విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను హెచ్‌ఎం తల్లిదండ్రులకు వివరించారు. తెనాలికి చెందిన చెరుకూరి రమేష్, పద్మావతి దంపతుల ఆర్థిక సహకారంతో సమకూర్చిన రూ. 10 వేల రూపాయల విలువైన నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, క్రేయాన్స్‌ను విద్యార్థులకు అందించారు. అనంతరం తిక్కిరెడ్డిపాలెం ప్రైమరీ స్కూల్ నుండి బదిలీపై వెళ్లిన గొల్లపూడి రవి కుమార్‌ను గ్రామస్తులు, తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. మాజీ జెడ్పీటీసీ భాగ్యారావు, మాజీ ఎంపీటీసీ భాగ్యారావు, దేవదానం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

గుంటూరు రూరల్: విద్య ద్వారానే అభివృద్ధి జరుగుతుందని 40వ డివిజన్ పెదపలకలూరు కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి అన్నారు. శనివారం గ్రామంలోని వైకేఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన గేరా మేఘనకు బంగారు పతకం, రూ.3 వేల నగదు అందజేశారు. మాగంటి యువరాజుకు వెండి పతకం రూ.2 వేలు నగదు, తృతీయ స్థానం సాధించిన కుందర పూజితకు కాంస్య పతకం రూ.1000 నగదు అందజేశారు. హెచ్‌ఎం పి.సత్యవాణి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఝాన్సీ పాల్గొన్నారు.

పాత గుంటూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



స్టేషన్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

పట్నంబజారు: జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ శనివారం పాత గుంటూరు పోలీసు స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పరిసరాలతో పాటు రికార్డులు పరిశీలించారు. స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎం.వి.సుబ్బారావు నుంచి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులకు న్యాయం జరిగేలా ముందుకు సాగాలని చెప్పారు. అనంతరం స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్టాండ్ ఉన్న నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ వెంట ఈస్ట్ డివిజన్ ఏఎస్పీ నిచికేష్ షలేకే, పాత గుంటూరు ఎస్‌ఐలు వెంకటేశ్వరరావు, వెంకట్రావు ఉన్నారు.

సీనియర్ జర్నలిస్టు కరిముల్లా మృతికి



చేబ్రోలు: పొన్నూరు పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి, షేక్ కరిముల్లా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు.మృత దేహానికి పలువురు ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కరిముల్లా మృతి బాధాకరమని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య విచారం వ్యక్తం చేశారు.

ఆధునిక బోధనతోనే పోటీ ప్రపంచంలో రాణింపు



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక బోధన పద్ధతులతోనే పోటీ ప్రపంచంలో రాణించగలమని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి సూచించారు. కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆంగ్ల మాధ్యమ బోధనలో భాగంగా రాష్ట్రంలోని 18 నోడల్ కేంద్రాల్లో వివిధ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులకు ఆంగ్ల మాధ్యమ బోధన, ట్రైనింగ్ ఆఫ్ ట్రెయినర్స్ రెండో బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సాంబశివపేటలోని మహిళా కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులతో పాటు మాస్టర్ ట్రైనర్లకు శనివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా అధ్యాపకులు ఆంగ్ల మాధ్యమంలో బోధన శైలిని అలవర్చుకుని, తద్వారా విద్యార్థుల్ని తీర్చిదిద్దాలని సూచించారు.

పీజీ ఈసెట్‌లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఎస్వీయూ ఇటీవల విడుదల చేసిన పీజీ ఈసెట్ ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఫార్మసీలో ప్రవేశానికి అర్హత కల్పించే పీజీ ఈసెట్‌కు కళాశాల నుంచి హాజరైన 23 మంది బీఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థులంతా ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. వారిలో ఐదుగురు 250లోపు ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఎం.కీర్తన 61వ ర్యాంకు, ఎస్.వైష్ణవి, వై.సాంబశివరావు 96వ ర్యాంకు, బి.చిరు దివ్యబాయి 121వ ర్యాంకు, ఎన్‌జేపీఎస్ పవన్ 250వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరంతా వివిధ ఫార్మసీ కళాశాలల్లో ఎం.ఫార్మసీలో అడ్మిషన్ పొందేందుకు అర్హత పొందారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా రవికుమార్, ఓఎస్డీ పి.సీతారామయ్య, పీజీ ఈసెట్ కోచింగ్ ఇన్‌చార్జ్‌లు సీహెచ్. ప్రసాదరావు, వై.రత్నసింధు అభినందించారు.

బాలికపై లైంగిక దాడి : యువకుడిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బాలికపై లైంగిక దాడి చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాలలరావుపేటకు చెందిన బాలికతో కోటేశ్వరరావు అనే యువకుడు స్నేహంగా మెలిగి ఈనెల 11న కిడ్నాప్ చేశాడు.
ఆమెపై లైంగిక దాడి చేశాడు. బాలిక ఫిర్యాదు మేరకు శనివారం నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ప్రేమ పేరిట మోసం

యువతిని ప్రేమించి మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. చేబ్రోలుకు చెందిన నవీన్ నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఉద్యోగం చేస్తుంటాడు. అదే కళాశాలకు చెందిన ఉద్యోగిని ప్రేమిస్తున్నట్లు నటిస్తూ స్నేహంగా మెలిగాడు. యువతి పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.